లెదర్ సెక్టార్ స్కిల్స్ శిక్షణ కేంద్రం ప్రారంభం సంతోషకరం: మంత్రి

విశాలాంధ్ర -తిరుపతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని షెడ్యూల్డ్ వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాల యువతకు లెదర్ సెక్టార్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక తడ మండలం పులివెంద్ర లో పిమ్ - ఏ జె ఏ వై స్కీం లో భాగంగా - ఏపి ఎస్సిఎఫ్ సి -లిడ్ క్యాప్ ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, లెదర్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో ఎస్సి యువత అభివృద్ధికి ఉచిత వసతి, శిక్షణ సెంటర్ ను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని షెడ్యూల్డ్ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాల యువతకు లెదర్ సెక్టార్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి లెదర్ ప్రొడక్ట్ డెవలపర్ కోర్సులో ఉచిత వసతి, శిక్షణను ఇవ్వనున్నారన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ తమ సొంత నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాల యువతకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించడం చాలా సంతోషం అని, ఈ శిక్షణ ను ప్రతి ఒక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలనీ, లెదర్ స్కిల్స్ పై సాంకేతిక పరమైన మెళకువలపై మరింత అవగాహన అవసరం అని భవిష్యత్ రోజుల్లో లెదర్, ఫ్యాషన్ టెక్నాలజీ కి మంచి రోజులు ఉన్నాయని అందుకు తగ్గట్టుగా మాంబట్టు సెజ్‌లో సుమారు 200 ఎకరాలలో భారత్ లెదర్ పరిశ్రమ కూడా స్థాపించామన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ వైస్ ఛాన్సలర్, మేనేజింగ్ డైరక్టర్ టి. డోల శంకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ పొందిన ప్రతి ఒక యువత కు ఉపాధి అవకాశాలు ఖచ్చితంగా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రఘు రెడ్డి, ఏపి ఎస్ సి ఎఫ్ సి సంస్థ డైరెక్టర్లు, లిడ్ క్యాప్ సిబ్బంది, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్యామ్ ప్రసాద్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తులు భయపడాల్సిన పని లేదు: సీఐ

విశాలాంధ్ర - చంద్రగిరి: గత మూడు రోజుల క్రితం సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై స్పందించిన అధికారులు స్పందించారు. అడపా రెడ్డిపల్లి - శివగిరి మధ్యలో ఉన్న శివాలయం వెనుక పొలా లలో పులి తిరుగుతున్నట్టు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో స్పందించిన అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అవి పులి అడుగులు కావనీ అటవీ అధికారులు తెలిపినట్లు ప్రజలు భయపడవలసిన పని లేదని చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపా రు. సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులు వెంటనే స్పందించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాచీన కాలం నుండే తెలుగు- కన్నడ సాహిత్య సంబంధాలు - ఆచార్య సుందరం

విశాలాంధ్ర -తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో ఆచార్య జక్కంపూడి మునిరత్నం ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగుశాఖతో తనకున్న అనుబంధాన్ని తెలిపారు. ప్రధాన వక్త మైసూరు విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు ఆర్‌వీఎస్ సుందరం 'తెలుగు కన్నడ భాషల సాహిత్య సంబంధాలు-తులనాత్మకత' అనే అంశంపై ఉపన్యసించారు. ప్రాచీన తెలుగు సాహిత్యం నేటి కన్నడ నాట, నాటి కన్నడ సాహిత్యం తెలుగు కవుల చేత సుసంపన్నమైందన్నారు. కన్నడ ఆది కవి పంప పూర్వీకులు తెలుగు వారని, జినవల్లభుడు పంపకవి సోదరుడని కుర్కియాల శాసన ప్రత్యేకతను చెప్పారు.తెలుగు ,కన్నడాలు ప్రాకృతం వంటి భాషలను జీర్ణించుకొని ప్రపంచ భాషలుగా గుర్తింపు పొందాయని, జానపద కథాగేయాలు విషయంలో రెండు భాషల్లో సారూప్యం వుందని, కంద పద్యాలలో వ్యాకరణ గ్రంథాలు రాయడం రెండు భాషల్లో వుందని, ఛందో గ్రంథాలు రెండుభాషల్లో ఒకే సారి వచ్చాయన్నారు. భారత రచనలో కన్నడ రచనను నన్నయ అనుకరించలేదని, శైవ సాహిత్యంలో రెండు భాషల్లో సారూప్యాలున్నాయన్నారు. తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో సాగిన ఈ సదస్సుకు ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షత వహించగా, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, వక్త ఆర్‌వీఎస్ సుందరంని పరిచయం చేశారు. ఈ సభలో డా.సునీల్ కుమార్, డా.బ్రహ్మానందరెడ్డి, డా.ఆదిశేషయ్య, డా.అశోక్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ సమావేశం

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతి ఏఐటీయుసి జిల్లా కార్యాలయంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ సమావేశం హేమలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ కి ప్రమోషన్ కల్పించాలన్నారు. ఇమ్యు నైజేషన్ కార్యక్రమం నెలలో నాలుగు సెషన్లు కండక్ట్ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలివ్వాలన్నారు. ఆన్ లైన్ యాప్స్ తగ్గించాలని, యూనిఫాం లేదా యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలని, బయోమెట్రిక్ సడలింపు ఇవ్వాలి.. లేదా ఫీల్డ్ లో వేసుకునే వెసులుబాటు కల్పించాలని, సెకండ్ సాటరడే సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ వర్క్ అలాట్ చేయకూడదని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ సెలవులు మంజూరు చేయటంలో వారిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఈ విషయాలు అన్నింటిపై జిల్లా అధికారులను కలుస్తామని తెలిపారు. అనంతరం సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు.

ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర- సూళ్లూరుపేట: సూళ్లూరుపేట లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. అడిషనల్ జడ్జి సివిల్ జడ్జి ఎస్. అనూష ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలను తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

30 నుండి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారం

విశాలాంధ్ర- పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణ ప్రాంతంలోని వామపక్ష నాయకులు వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పుత్తూరులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ ఆగస్టు 30 31 తేదీన సంతకాల సేకరణ, సెప్టెంబర్ ఒకటిన గ్రామ వార్డు సచివాలయాలకు వినతి పత్రాలు ఇవ్వాలని, సెప్టెంబర్ 3న నిరుద్యోగ వ్యతిరేక దినం సెప్టెంబర్ 4న మండల కార్యాలయం వద్ద ధర్నా వంటి ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ విజయ్, సుధాకర్, కృష్ణమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

గుంతల రోడ్లను బాగు చేయాలని వినతి

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణంలో గుంతల మయంగా మారిన రోడ్లను బాగు చేయాలని బిజెపి నాయకులు పలువురు విన్నవించారు. మంగళవారం సత్యవేడు బీజేపీ అధ్యక్షుడు గెడి మునిప్రతాప్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఎస్సీమోర్చా అధ్యక్షుడు ఎస్.మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వాసు,ఓబిసి మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేశ్వర్లు తదితరులు స్థానిక ఆర్అండ్ బి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు మునిప్రతాప్ మాట్లాడుతూ సత్యవేడు పట్టణంలోని నేతాజీ రోడ్డు,ఊతుకోట మార్గంలో రోడ్డు కంకర లేచిపోవడంతో పలుచోట్ల గుంతల మయంగా మారిందన్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే పలువురు వాహన దారులు గుంతలో పడి గాయాలు పాలైనట్టు ఆయన గుర్తు చేశారు. రానున్నది వర్షపు సీజన్ అయినందువల్ల గుంతలను పూడ్చి శాశ్వత ప్రాతిపదికన రోడ్డును బాగు చేయాలని కోరారు. పాలగుంట బస్టాండ్ మలుపు వద్ద వేగనిరోధకాలను యుద్ధ ప్రాతి పదికన ఏర్పాటు చేయాలని కోరారు.ఇక్కడ తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో తక్షణమే అక్కడ వేగ నిరోధకాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్లుకు మరమ్మతు లు చేయించడంతోపాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న చోట వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలన్నారు.

'మహాశక్తి'తో మహిళల జీవితాల్లో వెలుగు

విశాలాంధ్ర-తొట్టంబేడు: 'మహాశక్తి' పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగు నింపుతామని టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు చెప్పారు. తొట్టంబేడు, బోనుపల్లి, కొత్తకండ్రిగ గ్రామాల పరిధిలో మంగళవారం 'మహాశక్తి'పై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి మురళీనాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి ఇంట్లో ఎంతమంది ఆడబిడ్డలు ఉన్న వారందరికీ ఏడాదికి రూ.15వేలు వంతున ఆర్థిక సాయం చేస్తామన్నారు. వివిధ పథకాలు అమలు చేస్తామన్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్టీ అధ్యక్షులు భాస్కర్ నాయుడు , బోనుపల్లి మాజీ సర్పంచ్ రామానాయుడు, సీనియర్ నాయకులు పెద్దాసరి మంగారెడ్డి, బీసీ సెల్ నాయకులు భీమాల వెంకటేష్, భీమాలభాస్కర్, బాలసుబ్రమణ్యం, వీర రాఘవులు, దశరథ రామిరెడ్డి, విద్యాసాగర్, చింతగింజల సునీల్, బత్తెయ్య, జ్ఞానేంద్ర, చెరుకూరు శంకర్ నాయుడు, మెరిమి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మంత్రి రోజా కృతజ్ఞతలు

విశాలాంధ్ర- నగరి: సీఎం జగన్‌కు మంత్రి రోజా కృతజ్ఞతలు తెలిపారు. పెత్తందారులకే సొంతమైన ఉన్నత విద్యను ముఖ్యమంత్రి జగన్ పేదవాడి హక్కుగా మార్చారన్నారు. కోటీశ్వరుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే నాణ్యమైన విద్యను తినడానికి తిండి లేని పేదవాని బిడ్డకు కూడా జగనన్న అందుబాటులోకి తీసుకువచ్చారని మంత్రి రోజా ప్రశంసించారు. నగరి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశారన్నారు.

సేల్ టాక్స్ అక్రమ దందాగా ఏ నరహరి పేట చెక్‌పోస్ట్

విశాలాంధ్ర- గుడిపాల : సేల్ టాక్స్ అధికారులు తనిఖీల పేరుతో అక్రమంగా వాహనదారుల నుండి భారీ వసూళ్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు గుడిపాల మండలంలోని నరహరి పేట చెక్‌పోస్టు వద్ద అటుగా వస్తున్న వాహనాలు అన్నింటిని ఆపి తనిఖీల పేరుతో వాహనదారుల నుండి డబ్బులు దండుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇక పై అయినా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - గుడిపాల : తెలుగు మాతృ భాష దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిలో భాగంగా హరివిల్లు అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, (విశ్రాంతి ఉపాధ్యాయులు) , నరహరి పేట జెడ్.పి. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రసాద్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అందరూ పాల్గొని గిడుగు రామమూర్తి గురించి, తెలుగు గొప్పతనం గురించి ప్రసంగించారు, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత పోటీలలో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విశ్రాంతి ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డిని పూర్వ విద్యార్థులు ప్రతాప్, ఉదయ్ కుమార్ ఘనంగా సత్కరించారు.

ముక్కంటికి రూ.2 లక్షలు విలువ చేసే వెండి వస్తువులు వితరణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి మంగళవారం హైదరాబాదుకు చెందిన లక్కిరెడ్డి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సుమారు రూ.2లక్షలు విలువ చేసే వెండి గిన్నెలు బహూకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సీసీ సుదర్శన్ రెడ్డి, అర్చకులు కమల్ స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా పేట్రేగి పోతున్నా చర్యలు శూన్యం: టీడీపీ

విశాలాంధ్ర - చంద్రగిరి: నదీ గర్భాన్ని తొలిచేసినా వైసీపీ ప్రభుత్వంలో చర్యలు శూన్యమని వైసీపీ పెద్దల కనుసనల్లోనే ఇసుక మాఫియా పెట్రేగిపోతోందని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఇసుక దోపిడీపై మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి చంద్రగిరి తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రభుత్వ వ్యతిరేక విధానాలు అక్రమ ఇసుక దోపీడీకి నిరసనగా నినాదాలు చేసి ఏఎస్ఓ స్వర్ణలత కు వినతి పత్రం అందించారు. అనంతరం చంద్రగిరి పోలీస్ స్టేషన్ చేరుకున్న నాని ఎస్ఐ రవీంద్ర నాయక్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిలో ఎన్జీటి విధించిన నిషేధాజ్ఞలను పట్టించు కోకుండా అధికార వైసిపి ఇసుక అక్రమ దోపిడీ చేయటం దురదృష్టకరమన్నారు. అడ్డుకున్న తమ నాయకుల పై కేసులు పెట్టించి వేధించటం సమంజసమైన పద్ధతి కాదన్నారు. ఇసుక తవ్వకాల కాంట్రాక్టును జేపీ పవర్స్ వెంచర్స్ లిమిటెడ్ కు 13.05.21న అప్పగిస్తూ ఒప్పందం చేసుకున్నారని ఈ ఒప్పందం 12.05.23న ముగిసి 06.06.23 న జేపీ వెంచర్స్ జిఎస్టి నెంబర్ సస్పెండ్ అయిందని, అగ్రిమెంట్ ముగిసినా జీఎస్టీ నెంబర్ సస్పెండ్ అయినా అదే కంపెనీ పేరుతో అదే జిఎస్టి నెంబర్ తో దొంగ వేబిల్లులు ఇచ్చి మరీ ఇసుక అమ్మకాలు ఎలా సాగుతున్నాయని ప్రశ్నించారు. నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా స్థానికంగా భూగర్భ జలాలు ప్రభావం ప్రభావితం అవుతున్నాయన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో సాగు సాగునీటికి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని ఇసుక మాఫియా పై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ముమ్మాటికీ అసమర్థుడే: జనసేన

విశాలాంధ్ర-వెదురుకుప్పం: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ముమ్మాటికీ అసమర్థుడే అని జనసేన ఇంచార్జి పొన్నా యుగుంధర్ అన్నారు.మంగళవారం వెదురుకుప్పం మండల కేంద్రంలో, అంబేద్కర్ కూడలి వద్ద జనసేన బిజెపి ఆధ్వర్యంలో వెదురు కుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలనిధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడా పరిధిలో వెదురుకుప్పం 32 కిలోమీటర్ల దూరంలో ఉండగా, ఈ మండలం తిరుపతి జిల్లాకి పనికి రాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలో రెండు పదవులున్న మంత్రి పెద్దిరెడ్డి రొంపిచర్ల, పులి చర్ల మండలాలను తిరుపతిలో కలిపినప్పుడు అదే జిల్లాలో మూడు పదవులు ఉన్న ఉపముఖ్యమంత్రి ఒక మండలాన్ని కలపలేదా? అని ఆగ్రహం వ్యక్తం చేసాడు.రోజా చేసిన పనిని స్వామీ చేయలేదా అన్నారు. చెవిరెడ్డి చేసిన సాహసం, నారాయణ స్వామి ఎందుకు చేయలేదని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు.అందుకే ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి ముమ్మాటికీ అసమర్థుడే అని నొక్కి వక్కాణించారు. ఒక వారంలో ఉమ్మడి కార్యకర్తల ప్రణాళిక ప్రకటిస్తామని, వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపేంత వరకు విరోచితమైన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. మండల ప్రజలందరినీ యఏకం చేసి, ప్రజలందరిని అప్రమత్తం చేసి తిరుపతి జిల్లాలో కలపడం వల్ల వచ్చే ప్రయోజనాలను వివరించి సామూహిక ధర్నాలకు సిద్ధ పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం మండల అధ్యక్షులు పురుషోత్తం, బిజెపి మండల అధ్యక్షులు తిరుమల ఆచారి,జనసేన యతీశ్వర్ రెడ్డి, వెదురు మండల యువజన అధ్యక్షులు సతీష్,జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబెర్ హనుమంత్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గోవింద రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి, గంగాధర్ నెల్లూరు మండల ఉపాధ్యక్షులు తులసిరామ్, ప్రధాన కార్యదర్శి రషీద్, జనసేన మండల కార్యదర్శి సాయికుమార్, జనసేన మండల కార్యదర్శి బెనర్జీ, జనసైనికులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు జరిగితే కఠిన చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-తొట్టంబేడు: ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే కఠిన చర్యలు తప్పవని తిరుపతి కలెక్టరు వెంకట్రమణారెడ్డి హెచ్చరించారు. తొట్టంబేడు మండలం చిన్నసింగమాల, గురుకులపాళెం గ్రామాల్లో మంగళవారం ఆయన స్వయంగా ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి వెంటనే తొలగించాలన్నారు. 18ఏళ్లు నిండిన వారిని ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే వాటిని సరిదిద్దాలన్నారు. అధికారులు, బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సరి చూడాలన్నారు. అర్హులను ఓటర్ల జాబితా నుంచి ఎటువంటి పరిస్థితిలో తొలగించకూడదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషను ఆదేశాల మేరకు తాను స్వయంగా ఓటర్ల జాబితా పరిశీలిస్తున్నట్లు కలెక్టరు ఈ సందర్భంగా చెప్పారు. ఆర్డీవో, తహసీల్దారు కూడా క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలించి పారదర్శకంగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కేవీఎస్ రామారావు, తొట్టంబేడు తహసీల్దారు ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయ అధికారి రామమోహన్, వీఆర్వోలు మురళి, మువర్ణ, తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం: టీడీపీ

విశాలాంధ్ర-తొట్టంబేడు: ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వారు తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోందన్నారు. తూర్పు మండలాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. అధికార పార్టీ నేతలు స్వర్ణముఖినది నుంచి ఇసుక పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేస్తున్నారని వారు ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇసుక మాఫియాను పెంచి పోషిస్తుండగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి పోషిస్తుదన్నారు. ఇసుక అక్రమ వ్యాపారంతో వీరు రూ.కోట్లకు పడగలెత్తుతున్నారన్నారు. తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద ఇసుక రీచ్ అనుమతి రద్దు అయినప్పటికీ అధికార పార్టీ నేతల అండతో విచ్చలవిడిగా తరలిస్తున్నారన్నారు. ఇసుక రీచ్ విషయంలో కాంట్రాక్టరు నిబంధనలు పాటించడం లేదన్నారు. పరిమితిమించి ఇసుక తోడేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే టీడీపీ ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, కార్పొరేటరు మునిక్రిష్ణ, తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి , వూకా విజయ్ కుమార్, రుద్రకోటి సదాశివామ్, క్లస్టర్ ఇంచార్జీలు చెంచయ్యనాయుడు , మునిరాజా నాయుడు, పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, కంఠా రమేష్ , షాకీరాలీ, సుబ్బయ్య ,ప్రకాష్ నాయుడు, మిన్నల్ రవి, కాసరం రమేష్, వజ్రం కిషోర్, బషీర్, మునిరాజా యాదవ్, కిట్టు, లక్ష్మణ్, రామకృష్ణ, హరిబాబు, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

తెలుగు భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి

విశాలాంధ్ర -నగరి : తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి పంతులని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తిని, గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ని తెలుగు భాషా దినోత్సవం గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణించిందని తెలిపారు. గిడుగు తెలుగు వ్యవహారిక భాషకు పితామహుడుగా పరిగణిస్తున్నారని తెలిపారు. గిడుగు రామ్మూర్తి అభినవ వాగమశాసనుడుని బిరుదు వుందన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని వీలునూ తెలియజేప్పిన మహనీయుడు గిడుగు రామ్మూర్తిని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోనే వ్యవహారిక భాషద్యోమానికి మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. బహు బాషా శాస్త్రవేత్త చరిత్రాకారుడు సంఘ సంస్కర్త హేతువాది గిడుగు రామ్మూర్తిని అన్నారు. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింపజేయడానికి చిత్త శుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చరపిడుగు గిడుగు రామ్మూర్తి ని తెలిపారు. గిడుగు రామ మూర్తి ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాష లో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ వాడుక భాష వాదాన్ని చేపట్టినందుకు గిడుగు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - తిరుమల : టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మిలింద్ కేశవ్ నర్వేకర్, సౌరభ్ బోరా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయం స్వామి వారి సన్నిధిలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం వీరి వద్ద ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామి వారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని జేఈవో అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. టీటీడీ డెప్యూటీ ఈవోలు లోకనాథం, గోవిందరాజన్, పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ మామిడి తోటల పరిశీలన

విశాలాంధ్ర - చంద్రగిరి: పనబాకం గ్రామం లో డ్రిప్ ఇరిగేషన్ వేసుకొన్న మామిడి తోటలను చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ మంగళవారం పరిశీలించారు. బావి, బోర్ ఉన్న ప్రతి రైతు డ్రిప్ తప్పని సరిగా వేసుకోవాలని తెలియచేశారు. 5 ఎకరముల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీ, 5 నుండి10 ఎకరాలు ఉన్న వారికి 70 శాతం రాయితీ, స్ప్రింక్లర్లకి 5 ఎకరముల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 55 శాతంరాయితీ 5-10 ఎకరాలు ఉన్న వారికి 45 శాతం రాయితీ ఆంధ్ర ప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఇస్తున్నారని తెలిపారు. డ్రిప్ వేసుకోవడం వల్ల నీటిని, ఎరువులని మొక్కకి అవసరమైనంత మేరకు మాత్రమే అందించవచ్చని, కలుపు సమస్యను కూలీల ఖర్చును తగ్గించు కోవచ్చన్నారు. రైతులు ఈ డ్రిప్, స్ప్రింక్లర్ లను దరఖాస్తు చేసుకోవడానికి తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రా లను సంప్రదించాలన్నారు. నీరు తక్కువ ఉండి మామిడి చెట్ల నీటి ఎద్దడికి గురి కాకుండా రక్షించు కోవడానికి తగిన పరిమాణం గల ఫార్మ్ పాండ్ లను నిర్మించు కోవాలని ఈ ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి ఉద్యాన శాఖ ద్వారా 75,000 రూపాయలు రాయితీ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు తప్పని సరిగా వినియోగించుకోవాలని తెలిపారు. మామిడి తోట రైతులు చుట్టుపక్కల రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-కోట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాదిగలకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని తిరుపతి జిల్లా ఎస్ ఎం ఆర్ పి ఎస్ కన్వీనర్ ఆత్మకూరు నాగేంద్ర కోరారు. కోట మండలం శ్యామసుందర పురం గ్రామంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు కాకపోవడంతో మాదిగలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందజేసి మాదిగలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నన్నూరు వెంకటసుబ్బయ్య ఆత్మకూరు దయాకర్, చెరుకూరి రామకృష్ణ, ఆత్మకూరు రవి, పవన్ కళ్యాణ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, చెంచయ్య పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు మూర్ఖుడు : మంత్రి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మూఢుడు, మూరు?డు అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున వ్యాఖ్యానించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం కాసాగార్డెన్ లో గల బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, విద్యాబోధన, పరీక్షా ఫలితాల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలోని కర్నూలును రాజధాని చేస్తామని మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెబుతుంటే చంద్రబాబునాయుడు వ్యతిరేకి స్తున్నాడన్నారు. రాయలసీమ అభివృద్ధి చెందకూడదనే ఉద్దేశ్యంతోనే చంద్రబాబునాయుడు ఇలా వ్యతిరేకిస్తున్నారని మంత్రి మేరుగ నాగర్జున ఆరోపించారు. ఆలోచన లేని వ్యక్తి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా వాసిగా ఆయన ఉండటం తనకు సిగ్గుగా ఉందన్నారు. అంతకు మునుపు ఆయన రాష్ట్ర ప్రజలకు తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వాడిగా... తెలుగు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆలోచించే వ్యక్తిగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపు తున్నామన్నారు. విద్య, పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం తమ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తెస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కిందన్నారు. శ్రీకాళహస్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. ఈ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇక్కడే ఇంటర్మీడియట్ లో 80శాతం పైగా ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రి మేరుగ నాగార్జున ఆకాంక్షించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో ఇంకా మెరగైన వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ఈ పాఠశాలలను తీర్చి దిద్దుతా మన్నారు. ఈయన వెంట శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

చెవిరెడ్డి పెళ్లి కానుక పంపిణీ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలానికి చెందిన నూతన వధూవరులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందించే పెళ్లి కానుకను అందుకున్నారు. ఈ కానుకను జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం సాయంత్రం అందజేశారు.చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వివాహ బంధంతో ఒక్కటయ్యే నూతన వధూవరులను కుటుంబ సభ్యుల్లా భావించి తన సొంత నిధులతో పెళ్లి కానుకను అందించడం ఆనవాయితీగా వస్తోంది. మల్లంగుంట పంచాయతీ వినాయక నగర్ కాలనీ, మిలటరీ కాలనీకి చెందిన వదూవరులు జయంతి, రాజేష్ ఈ నెల 31వ తేదీన శుభముహూర్తాన వివాహం జరగనుంది. ఈ సందర్భంగా పెళ్లి కానుకలో వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళి బొట్టు, వెండి మెట్టెలు, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, వడ, తిరుచానూరు అమ్మవారి ఆలయం నుంచి పసుపు కుంకుమ, వెండి బాసికాలు, పెళ్లి కుమార్తెకు గాజులు, ఎమ్మెల్యే పెళ్లి శుభాకాంక్షలు తెలియజేసే గ్రీటింగ్ కార్డ్ ను అందజేశారు. ఈ క్రమంలో నూతన వధూవరులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామచంద్రయ్య, హేమాద్రి పాల్గొన్నారు.

టీటీడీ ఆలయాల అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - నారాయణవనం: మండలంలోని అనుబంధ ఆలయాల అభివృద్ధికి టీటీడీ పాలకమండలపై ఒత్తిడి తీసుకు రావాలని స్థానికులు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కోరారు. టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని ఆయన మంగళవారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు సాదరంగా ఆహ్వానించి పూజా ఏర్పాట్లను చేపట్టారు. అర్చనలో పాల్గొన్న ఆదిమూలంకు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కల తప్పిన ఆలయాన్ని పరిశీలించారు. ఆలయాన్ని పూర్తి స్థాయిలో పునఃనిర్మాణానికి ఏడాది క్రితం టీటీడీ ఇంజనీరింగ్ విభాగం రూ 7.5 కోట్ల అంచనాతో ప్రతిపాధనలు సింద్ధంచేసినట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. టీటీడీ పాలకమండలి అనుమతించాల్సి ఉందని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఫైల్ పరమశివుని ఘణాధిపతి వీరభద్రుడి భద్రకాళీ సమేతుడైన నారాయణ వనంలో కొలువై ఉన్న ఆలయాన్ని అభివృద్ధికి సహకరించాలని స్థానికులు కోరారు. వీరభద్ర ఆలయంతో పాటు టీటీడీ కల్యాణ మండప మరమ్మత్తులు, ఆధునీకరణకు టీటీడీ చైర్మన్‌తో చర్చించి, అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ శివశంకర్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ అన్నాదొరై, కైలాసకోన బోర్డు మెంబర్ ఢిల్లీ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ హేమచంద్రారెడ్డి ఉన్నారు.

గాలేరు -నగరి పనులు వేగవంతం చేయాలి: మంత్రి

విశాలాంధ్ర- నగరి: గాలేరు- నగరి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. మంగళవారం మంత్రి రోజా మాట్లాడుతూ నగరి మరమగ్గాల పరిశ్రమ ద్వారా వేలాది మంది కార్మికుల ఉపాధి పొందుతున్నారన్నారు. అయితే ఈ పరిశ్రమలు ఎప్పటినుంచో బాధలతో సతమతమవుతున్నాయని అన్నారు. మర మగ్గాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పరిశ్రమల ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి పొందుతున్నారని ఆమె అన్నారు.

నేడు రేపు దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

విశాలాంధ్ర - చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానం వలన ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదని, ఓరిజినల్ దస్తావేజులు లేకుండా కేవలం డిజిటల్ దస్తావేజులు డౌన్లోడ్ చేసుకొని అదే ప్రింట్ తీసుకొని ఓరిజినల్ దస్తావేజుగా చలామణి అయ్యేటట్లుగా నూతనముగా అమలు చేయ బోవు ఈ విధానం వల్ల లీగల్ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఉన్నందున ఈ విషయాలు ను ప్రజలకు తెలిపేందుకు బుధవారం, గురువారం దస్తావేజు లేఖరులు స్టాంపు వెండర్లు , ఈ వృత్తిపై ఆధారపడి జీవించే వారందరు కలసి రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు పెన్ డౌన్ నిర్వహించనున్నారని తిరుపతి దస్తావేజు లేఖరులు విధిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సిఎమ్ కేశవులు (బుజ్జి) ఓ ప్రకటనలో కోరారు.

వైభవంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని శ్రీరంగ రాజపురం మండలంలోని కొత్తపల్లిమిట్ట హై స్కూల్ ప్లస్ లో తెలుగు భాషా దినోత్సవంను, జ్ఞానచంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవం ను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు యస్.శాంతి ఆధ్వర్యంలో తెలుగు విభాగం డి. ఉదయకుమార్,డాక్టర్ బండి ప్రభాకర్ రెడ్డి,యమ్. ఉమామహేశ్వరి,జరీనా బేగం,బి.చండీ ప్రసాద్ లు పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిల్ల, ధనంజయులు, షణ్ముగం, పుర ప్రముఖులు, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

ఉర్దూ పాఠశాలలో అదనపు గదుల ఏర్పాటుకు కృషి: చైర్మెన్

విశాలాంధ్ర-పుంగనూరు:-పట్టణంలోని సూర్య నగర్‌లో ఉన్న ఉర్దూ పాఠశాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ హలీం భాష ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ తప్పనిసరిగా పాటించి నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రాంతాన్ని పరిశీలించి విద్యార్థుల సంఖ్య పెరగడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సూచనల మేరకు అదనపు గదుల నిర్మాణానికి నిధులు ఏర్పాటు చేసి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభ పద్ధతిలో విద్యను బోధించి ఉత్తీర్ణత శాతం సాధించడం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండి అమ్ము మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - కుప్పం: ఎన్ఎస్ఎస్ విభాగం, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల నందు భారత హాకీ క్రీడాకారుడైన స్వర్గీయ ధ్యాన్చంద్ గౌరవ సూచికంగా ఆయన పుట్టిన రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్ సునీల్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని , విరామ సమయంలో వారికి నచ్చిన క్రీడల కోసం సమయాన్ని కేటాయించాలన్నారు. విద్యార్థులు ధ్యాన్చంద్ ను స్ఫూర్తిగా తీసుకొని దేశానికి కీర్తిని తీసుకురావాలని కోరారు ఒలంపిక్ గేమ్స్ లో మూడుసార్లు మన భారత్ కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్ చంద్ కి దక్కుతుందని, ధ్యాన్ చంద్ నేతృత్వంలో చారిత్రాత్మక విజయాలు మన భారతదేశానికి దక్కడంతో భారతదేశం పేరు క్రీడారంగంలో మార్మోగి పోవడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. అనంతరం ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ సాగర్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవన్,కుప్పం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విమల జోసెఫ్, కుప్పం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం: పి తులసీనాథం నాయుడు

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగు భాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసీనాదం నాయుడు అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని కళామందిరంలో గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం 20 20 ప్రకారం పాఠశాలల విద్య మాతృభాషలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారతదేశానికి రెండవ జాతీయ భాషగా తెలుగును అమలు చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామ సచివాలయం వరకు పాలన తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని మాతృభాషాభిమానంలో పక్కనున్న తమిళనాడు ను ఆదర్శంగా తీసుకోవాలని తెలుగులో మాట్లాడటం గర్వకారణంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప, శివ శంకర్ రెడ్డి, ఎల్లంపల్లి నరేంద్ర, శ్రీపురం సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వందరూపాయల నాణెం విడుదలపై సంబరాలు

విశాలాంధ్ర - పుంగనూరు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి సినీ నటుడు ప్రజల ఆరాధ దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు చిహ్నంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వంద రూపాయల నాణ్యం విడుదలపై సంతోషం వ్యక్తం చేస్తూ నందమూరి తారక రామారావు జిల్లా అభిమాన సంఘం నాయకులు డాక్టర్ అప్పిరెడ్డి యాదవ్ అభిమానులతో కలిసి గోకుల్ సర్కిల్ నందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్స్ పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పిరెడ్డి యాదవ్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తన ప్రాణం ఉన్నంతవరకు నందమూరి తారక రామారావు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు కేంద్ర ప్రభుత్వం స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో నందమూరి అభిమాన సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, శారీరక దృఢత్వం పెంపొందించుకోవడం సాధ్యం

విశాలాంధ్ర - కుప్పం : బసప్ప స్మారక క్రికెట్ టోర్నమెంట్ కు గుడిపల్లి మం. సంగనపల్లి లో యువకులు, క్రీడాకారులు ఉత్సాహం తో పాల్గొన్నారు . బసప్ప స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గుడిపల్లి ఎస్సై లక్ష్మీకాంత్ క్రికెట్ బ్యాట్‌ను చేతపట్టి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. సంగనపల్లికి చెందిన బసప్పను స్మరించుకుంటూ బసప్ప తనయులు మోహన్ బాబు , శ్రీధర్, హేతామ్స్ సంగణపల్లిలో టోర్న్ మెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో బూరుగుల పల్లి, బోయనపల్లి, చిన్నపర్తికుంట, పెద్దపర్తికుంట గ్రామాల నుండి టీములు పాల్గొన్నాయి. ఈ టీములలో ఫైనల్స్‌కు సంగణ పల్లి, చిన్న పర్తి కుంట టీమ్‌లు చేరుకున్నాయి. సంగణపల్లి టీం గెలుపొందింది. మొదటి బహుమతిగా 12 వేల రూపాయలు, రెండవ భహుమతిగా 6 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 3 వేల రూపాయలతో పాటు ట్రోఫీలను గుడిపల్లి ఎస్సై లక్ష్మీకాంత్ అందజేశారు. క్రీడల్లో గెలుపొందిన వారిని ఎస్సై లక్ష్మీకాంత్ అభినందించారు. ఈ బహుమతుల ప్రధానం కార్యక్రమములో జడ్పీటిసి కృష్ణమూర్తి, సర్పంచి అమర్నాథ్, రవి, సుబ్రమణ్యం, వెంకటేష్, సంపంగి పాల్గొన్నారు.

కుప్పంలో ఎన్టీఆర్ సంజీవని వైద్యశాలను ప్రారంభించిన నారా భువనేశ్వరి

విశాలాంధ్ర - కుప్పం : అందరికీ ఉచిత ఆరోగ్యం అందాలన్న సదుద్దేశంతో కుప్పం ప్రజలు ఆనందంగా వుండాలని ఎన్టీఆర్ సంజీవని ఉచిత వైద్యశాలను ప్రారంబిస్తున్నట్లు నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలో ఎన్టీఆర్ సంజీవిని ఉచిత వైద్యశాలను ప్రారంభించిన నారా భువనేశ్వరి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీ ఆర్ ట్రస్ట్ ప్రజలకు సేవలు అందించడం కోసం స్థాపించాం అని ఎల్లప్పుడూ ప్రజా సేవకు సిద్ధంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఉంటుందని అని తెలిపారు. కుప్పం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్టీయార్ సంజీవిని ఏర్పాటు చేశాం అని, కుప్పం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఎన్టీఆర్ స్మారక నాణ్యం కేంద్రం విడుదల చేయడం ఆనందంగా ఉంది, ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం అని, ప్రభుత్వంతో మాకు ఎటువంటి పోటీ లేదు, కుప్పంలో ఎన్టీయార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు అవసరం అయిన పలు కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కుప్పం ప్రజలకు సేవ చేయడానికి మా కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ముందంజలో ఉంటుందని, అందులో భాగంగానే నేడు ఎన్టీఆర్ సంజీవిని వైద్యశాల మొబైల్ క్లినిక్ ను సైతం ప్రారంభించామని అన్నారు. అదేవిధంగా కుప్పం తిరుపతి గంగమాంబ ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు నియోజకవర్గ తెదేపా నేతలు, మహిళా నేతలు కార్యకర్తలు సైతం ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. నారా భువనేశ్వరి కుప్పం పర్యటనతో పాటు ఆమె పాల్గొన్న కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెదేపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి :కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి పంతులని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు డి ఆర్ ఓ యన్.రాజశేఖర్ తో కలసి గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తిని, గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ని తెలుగు భాషా దినోత్సవం గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణించిందని తెలిపారు. గిడుగు తెలుగు వ్యవహారిక భాషకు పితామహుడుగా పరిగణించబడతారని తెలిపారు. గిడుగు రామ్మూర్తి అభినవ వాగమశాసనుడుని బిరుదు కలదన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని వీలునూ తెలియజేప్పిన మహనీయుడు గిడుగు రామ్మూర్తిని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోనే వ్యవహారిక భాషద్యమానికి మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. బహు భాషా శాస్త్రవేత్త చరిత్రాకారుడు సంఘ సంస్కర్త హేతువాది గిడుగు రామ్మూర్తిని అన్నారు. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింపజేయదానికి చిత్త శుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చరపిడుగు గిడుగు రామ్మూర్తి ని తెలిపారు. గిడుగు రామ మూర్తి ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాష లో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ వాడుకు భాష వాదాన్ని చేపట్టినందుకు గిడుగు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, కలెక్టరేట్ ఏ ఓ .కులశేఖర్, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టండి:డిప్యూటీ సి ఎం

విశాలాంధ్ర -చిత్తూరు: రెవెన్యూ సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని డిప్యూటీ సిఎం కె.నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర శిశు సంక్షేమ , వయోవృద్ధుల సంక్షేమ శాఖ మాత్యులు ఉషశ్రీ చరణ్ అధ్యక్షతన జిడి నెల్లూరు , పూతల పట్టు నియోజక వర్గాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగాడిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్పందన జగనన్నకు చెబుదాం లో భాగంగా ఎక్కువగా రెవిన్యూ సమస్యలు రావడం జరుగుతున్నదని, ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని తెలిపారు. దీనితోపాటు ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్లలో స్మశాన వాటికల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న లేఔట్లలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశం లో ఇన్చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందాలనదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించాలన్న ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటివరకు ఆరు నియోజకవర్గాల్లో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు గ్రామాల్లోకి వెళ్లి గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు అవసరం ఉన్నది తెలుసుకొని ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుటకు రూ. 20 లక్షలు నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పూతలపట్టు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గాల అభివృద్ధి పై ఉప ముఖ్య మంత్రి, యం పి.జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని వివరించారు. పూతలపట్టు నియోజకవర్గం నకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు నియోజకవర్గంలో పి ఆర్,ఆర్ రోడ్ల అభివృద్ధి, అటవీ సమస్యలు ఈ సమావేశం దృష్టికి తీసుకురావడం జరిగిందని, డిప్యూటీ సీఎం లిఫ్ట్ ఇరిగేషన్, అటవీ భూములు, లబ్ధిదారులకు అందించే భూములు సమస్యల గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. ఇవన్నీ కూడా జిల్లా కలెక్టర్ నోట్ చేసుకోవడం జరిగిందని వీటికి సంబంధించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ ఈ నియోజకవర్గ పరిధిలో కోదలమడుగు, టేకుమంద, మొగలి,కీర మంద,పాలేరు గ్రామాలలో సోలార్ ఫినిషింగ్ నిర్మించాలని, పిఆర్ మరియు ఆర్అండ్‌బి రోడ్డు పనులను పూర్తి చేయాలని విన్నవిం చారు ఈ సందర్భంగా జీడీ నెల్లూరు నియోజకవర్గ ప్రగతిని కలెక్టర్ ష న్మోహన్ మంత్రులకు వివరిస్తూ ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలలో భాగంగా.జీడీ నెల్లూరు నియోజకవర్గానికి సంబంధించి రూ.31.8 కోట్లతో 88 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా రూ.22.71 కోట్లతో 47 భవన నిర్మాణాలు, రూ.18.52 కోట్లతో 85 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా రూ.12.25 కోట్లతో 49 ఆర్ బి కె భవనాలు, రూ.9.82 కోట్లతో 56 వై. యస్. ఆర్ హెల్త్ క్లినిక్ లు మంజూరు కాగా రూ.5.95 కోట్లతో 12 భవన నిర్మాణాలు పూర్తి అయినవని, మిగిలిన నిర్మాణాలు పురోగతిలో ఉన్నవని తెలిపారు. ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ క్రింద సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.118.32 కోట్లతో 2528 పనులు మంజూరు కాగా రూ.34.47 కోట్లతో 718 పనులు పూర్తి కాబడినవని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన 202పనులకు రూ.7.60 కోట్ల అంచనాలతో నిధులు విడుదల కావడం జరిగిందని, ఇందులో రూ.2.13 కోట్ల తో 82 పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారురహదారులు, రోడ్ల నిర్మాణంలో భాగంగాజీడీ నెల్లూరు నియోజకవర్గంలో 108.200 కి.మీల పొడవు గల స్టేట్ హై వే, 238.097 కి.మీ ల పొడవు గల మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు, 48 కి.మీ ల పొడవు గల ఇతర రోడ్లు మొత్తం 394.297 కి.మీ ల పొడవు రోడ్డు నిర్మాణాలు కలవని తెలిపారు. 2019 -24 సంవత్సర కాలంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ.1789.50 కోట్లతో 87.79 కి.మీల బి టి రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు .

ఘనంగా తెలుగు భాష దినోత్సవాలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు, మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సిద్దరామయ్య మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం -కన్నతల్లి ప్రేమ లాంటిదని అన్నారు. అనంతరం విద్యార్థినిలు తెలుగు భాష ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 పోకల తాతయ్య, హెచ్ఎం లు శ్రీ వాణి, ఫజ్లులుల్లా, సిఆర్ పి లు మునీర్ అహ్మద్, మునీశ్వర, అశ్రుప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిడుగు అడుగులు తెలుగు భాషాభివృద్ధికి సోపానాలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఆధునిక తెలుగు సాహిత్య వైతాళికులు గిడుగు అడుగులలో తెలుగు భాషాభివృద్ధికి సోపానాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. జాతీయ తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు వెంకట రామూర్తి జయంతి, జాతీయ క్రీడాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యారంగంలో చేసిన కృషి, పాఠశాలల్లో సమాచార ప్రచార మాధ్యమాలలో సాహిత్యం వాడుక భాషా వినియోగంలో గిడుగు చేసిన కృషిని వివరించారు. కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా కామన్ఎగ్జామినేషన్ కార్యదర్శి హేమారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగుభాషాదినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే ఆర్కేఎస్పార్, పాదిరికుప్పం, ఆర్కేవీబీపేట, కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల. ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో తెలుగు జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు,పీడీలు.పీఈటీలు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం సమర్ధవంతంగా అమలు

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థ వంతంగా అమలు చేస్తున్నామని ద్వామా పిడి గంగాభవాని అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పీడీ మాట్లాడుతూ ఉపాధిలో కూలీలందరికీ పనులు కల్పించే విధంగా ముందుంటున్నామని ,నీటి నిల్వకుంటలకు, పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఉపాధితో కూలీలు రైతులకు ఎంతో మేలు చేకూరుతున్నదని అన్నారు. అనంతరం డిఆర్‌పిలు మండలంలోని 25 గ్రామపంచాయతీలలో జరిగిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. ఈ సభలో ఉపాధి విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఏపీడి శ్రీనివాసులు, క్లస్టర్ టి. ఏ జ్యోతి రెడ్డి, ఏపీవో షౌకత్ అలీ, ఏఎంసి ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ఈసి కృష్ణయ్య, ఉపాధి సిబ్బంది, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలతో మహిళలకు ఆటోలు
చిత్తూరు డిఆర్డిఏ పిడి

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లాలో స్వయం సహాయక సంఘ సభ్యులైన ఎస్సీ ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణాలతో ఆటోలను అందజేయనున్నట్లు చిత్తూరు డిఆర్ డిఏపీడి తులసి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘాల ఆర్థిక లావాదేవీలను చక్కగా నిర్వహిస్తూ 50 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి ఎల్ ఎల్ ఆర్ లైసెన్స్ కలిగిన ఎస్సీ ఎస్టీ గ్రామీణ ప్రాంతాల కు చెందిన మహిళలే ఇందుకు అర్హులని పేర్కొన్నారు. సంఘాల్లోని ఎస్సీ ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. డీజిల్, బ్యాటరీ ప్యాసింజర్ ఆటలతోపాటు ,సరుకు రవాణా చేసే ఆటోలను కూడా అందించడం జరుగుతున్నారు . ఆటోల మొత్తం వ్యయంలో సభ్యులు తమ వాటా కింద ముందుగా 10 శాతం జమ చేయాల్సి ఉంటుందని మిగిలిన మొత్తాన్ని 60 కంతుల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మండలానికి రెండు ఆటోలు మాత్రమే ఈ పథకం కింద అందించడం జరుగుతుందని పూర్తి సమాచారం కోసం 9390504602 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

దళారీ వ్యవస్థ లేకుండా పథకాలు
-నేరుగా లబ్ధిదారులని ఖాతాకు జమ చేస్తున్న ప్రభుత్వం
-గడప గడపలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం అందజేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళ త్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండలంలో ఆశత్తూరు సచివాలయం పరిధిలోని కొత్తూరు, ఆళ త్తూరు, టీటీ కండ్రిగ శీకాయపట్టిడ, లక్ష్మీపురం, సేకువారిపల్లి, ఈడిగపల్లి గ్రామాల్లో డిప్యూటీ సీఎం కుమార్తె. సీనియర్ నాయకురాలు కృపాలక్ష్మి, ఎంపీపీ లత, సర్పంచ్ పుష్పాంజలి ఆధ్వర్యంలో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షితులై జగనన్న ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. అనంతరం ఆకత్తూరు గ్రామంలో శిల్ప మాట్లాడుతూ వర్షం వస్తే రోడ్డు బురద మయంగా మారుతుందని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన మంత్రి వెంటనే సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్ రాజు, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి వైస్ ఎంపీపీ కార్తీర్రెడ్డి, మండల కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురందర్, జిల్లా కార్యద ర్శి గోపీ, మాజీ సర్పంచ్ ధర్మయ్య, నాయకులు క్రిష్ణారెడ్డి, సర్వేశ్వర్, ధనంజయవర్మ, జయకుమార్, శ్రీనివాసులునాయుడు చిట్టి, ఏకాంబరం, లోకనాథరెడ్డి, రాము, చందురాజు, పలువురు పాల్గొన్నారు.

తెలుగు కీర్తిని చాటిన మహనీయుడు ఎన్టీఆర్

విశాలాంధ్ర- పలమనేరు :తెలుగువారి కీర్తిని దశదిశల చాటిన గొప్ప మహనీయుడు నందమూరి తారక రామారావు అని పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన స్మారకార్థం జాతీయ స్థాయిలో గుర్తింపునిస్తూ వందరూపాయల నాణెంని గౌ. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రెండ్రోజుల క్రితం ఆవిష్కరించిన విషయం తెలిసిందే. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ పలమనేరులో సంబరాలు చేసుకున్నారు. స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన్ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి స్వీట్స్ పంచి పెట్టి ఎన్టీఆర్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సినిమా, రాజకీయ చరిత్రపై చెరగని ముద్ర వేసిన యుగపురుషుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన ఆయనకు భారత రత్న ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఏదేమైనా ఎన్టీఆర్ కు దక్కిన అరుదైన ఈ గౌరవం మనందరికి గర్వకారణమని ప్రతి తెలుగు వారు హర్షించదగిన విషయమన్నారు. ఎన్టీఆర్ తనయుడు స్వర్గీయ హరికృష్ణ వర్ధంతి కావడంతో ఆయన పేరు మీదుగా నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టి, నాగరాజు,సోమశేఖర్,మదన్, శ్రీధర్, , మాబాషా, అమానుల్లా, లోకేష్,శ్రీనివాసులు,బాబాజాన్, నదీం, సురేంద్ర,మురళి, వెంకటరమణ,మురళీకృష్ణ, పురుషోత్తం, చిన్ని, సుధాకర్,మరియు ప్రమీల, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-పలమనేరు :శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం నందు హుండీ లెక్కింపు వలన 231574 వచ్చినది శ్రీ సత్య గంగమ్మ దేవస్థానం నందు హుండీ లెక్కింపు వలన 1,04062 రూపాయలు వచ్చింది. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి మదనపల్లి డివిజన్ దేవాదాయ శాఖ అధికారి మరియు గ్రూప్ దేవస్థానములు పలమనేరు కార్యనిర్వాహణాధికారి దేవస్థానం చైర్మన్లు ధర్మకర్తలు అర్చకులు మరియు సిబ్బంది హుండీ లెక్కింపు కార్యక్రమం నందు భక్తాదులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం

విశాలాంధ్ర-పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం భూమి రిజిస్ట్రర్ల విభాగంలో డిజిటల్ విధానం తీసుకొని వస్తుండడంతో దీనివలన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడతారని ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 30 31 రెండు రోజులపాటు దస్తావేజు లేఖరు పెన్‌డౌన్ విధించడం జరిగింది. ప్రజలంతా దస్తావేజు లేఖర్ల నిర్ణయాన్ని స్వాగతిస్తూ సహకరించాలని పుంగనూరు దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపునిచ్చారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి కార్యదర్శి జగదీశ్వరరావు ట్రెజరర్ త్యాగరాజు తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండలంలోని ఆర్కేవిబి పేట సచివాలయం రాజులకండిగా గ్రామంలో వర్షకాలం ముందస్తు చర్యలో భాగంగా మంగళవారం సీజనల్ వ్యాధుల పట్ల మండలం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమకాటు వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రభలు తాయని నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఇంట్లో కిటికీలకు మేష్‌లు ఏర్పాటు చేసుకువాలన్నారు. కలుషితమైన నీటివలన టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని, కాచిచల్లార్చిన నీరు తాగాలని చిన్న చిన్న వ్యాధులకు సచివాలయం వద్ద ఎఎన్ఎం, ఎంఎల్హెచ్పి వద్ద చికిత్స చేసుకోవచ్చునన్నారు. దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోకి చికిత్స చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగరాజు, రెడ్డమ్మ, అంబరిష్ రాజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పి)లతో విద్యాబోధనపై డిజిటల్ తరగతులు ప్రారంభించినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ డిజిటల్ విద్యావిధానంలో ఐఎఫ్‌పిలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయని ఈ విధానం వల్ల విద్యార్థులకు పాఠ్యాంశంలోని ప్రతి అంశాన్ని అర్థమయ్యే రీతిలో బోధించదానికి వీలవుతుందని అన్నారు. విద్యార్థులు వారి యొక్క విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉపాధ్యాయులు కూడా మంచి ప్రావీణ్యం సాధించి, వారికి తెలియని విషయాలను శాస్త్ర సాంకేతిక పరంగా తెలుసుకుని మంచి ప్రగతి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, వేణుగోపాల్, రాజేంద్ర,వెంకట రమణరెడ్డి, స్నేహమాలిని, సైదుల్లా ,మురళీ మోహన్ పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలస్వామి

విశాలాంధ్ర-కార్వేటినగరం: తెపోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండవ రోజు మంగళవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్ను పట్టు వస్త్ర సుగంధర భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు ధర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్ కుమార్. టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: వైసిపి పార్టీ బలోపే తానికి సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు సైనికుల్లా పనిచేయాలని పుంగనూరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు జింక చలపతి అన్నారు. పులిచెర్లలో మంగళవారం మండల స్థాయి సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో మండల సచివాలయ కన్వీనర్ మురావత్ భాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత పటిష్టం చేయాలని అన్నారు. అనంతరం వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమితులైన హేమ సుందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాశి ప్రసాద్, ఎంపీటీసీ పోకల చంద్ర,వైసిపి నాయకులు రెడ్డి ఈశ్వర్ రెడ్డి, నాదముని రెడ్డి, రాయల్ మోహన్, గోవింద్ రెడ్డి, నరసింహులు, మునస్వామి, పోకల గంగయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించండి

- మంత్రి మేరుగ నాగార్జునకు వినతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏపీ రెసిడెన్షియల్ కాంట్రాక్ట్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆ శాఖా మంత్రి మేరుగ నాగార్జునకు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణం కాసాగార్డెన్ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఒప్పంద ఉపాధ్యాయులు ఆయన్ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 793 మంది కాంట్రాక్టు టీచర్లు దాదాపు 16 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తమను సొసైటీ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగు లుగా గుర్తించారని ప్రస్తుతం దాన్నే సాకుగా చూపి రెగ్యులర్ చేయకుండా మోకాలడ్డడం అన్యాయమని వాపోయారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2002-2006 వరకు కాంట్రాక్టు పరిధిలో పనిచేసిన ఉపాధ్యా యులను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2014కు ముందు నుండి ఇప్పటివరకు పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ హామీ ఇచ్చారని ఆ జాబితాలో సాంఘిక సంక్షేమ శాఖా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను చేర్చకపోవడం బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో గురుకుల సొసైటీ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను అక్కడి సీఎం కేసీఆర్ రెగ్యులర్ చేశారని ఏపీలో అందుకు భిన్నంగా సొసైటీని సాకుగా చూపి కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం చేయడం భావ్యం కాదని వా పోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి సొసైటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను సైతం క్రమ బద్ధీకరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈయన వెంట శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించండి..

సాంఘిక సంక్షేమ శాఖా సొసైటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలంటూ ఓ వైపు ఏపీ రెసిడెన్షియల్ కాంట్రాక్ట్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు వినతి పత్రం అందించారు. అదే శాఖలో పార్ట్ టైం టీచర్లుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్టు పరిధిలోకి తీసుకోవాలంటూ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఇంకోవైపు ఏపీ రెసిడెన్షియల్ పార్ట్ టైం టీచర్ ఫెడరేషన్ నాయకులు కూడా ఆ శాఖ మంత్రికి వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే క్రమంలో ఖాళీ అయ్యే స్థానాలకు పార్ట్ టైం టీచర్లను బదిలీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1800 మంది పార్ట్ టైం టీచర్లను కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకుంటూ అవసరమైతే బాలుర రెసిడెన్షియల్ గురుకులాలో సైతం పని చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

తిరుపతి జిల్లా

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మన్నారు, పోలూరు లోని ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినోత్సవం సందర్భంగా తెలుగు భాష వారోత్సవాలను నిర్వహించి విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రఖ్యాత కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయి బాబా, సుంకర ప్రతిమ, శేషగిరిరావు, అలవల సుధాకర్ రావు నేతృత్వంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అట్రంబాక దశరథ రెడ్డి ,వినయ్ సాగర్ ,సాయిరాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు జ్యోతిలక్ష్మి, వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అమ్మభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల అన్నారు. ది స్కూలులో మంగళవారం మాతృ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశాల మాట్లాడుతూ తెలుగుదనం లోని గొప్పతనం తెలుసుకోవాలన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా అమ్మ భాషను మరవకూడదన్నారు. ఉద్యోగ అవకాశాల కోసం ఆంగ్ల భాషను నేర్చుకుంటూనే... తెలుగు ప్రాభవాన్ని కొనసాగించాలన్నారు. మాతృభాషా దినోత్సవంను పురస్కరించుకుని విద్యార్థులచే ఏర్పాటు చేసిన ప్రసంగాలు, నాట్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అమ్మభాష అమృతం లాంటిదని పలువురు వక్తలు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు దీనదయాల్ అధ్యక్షత వహించారు. అతిథులుగా ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ మాలతి గేబ్రియల్, పద్మప్రియ, విశ్రాంత ఉపాధ్యాయులు విద్వాన్ గురునాథం, అన్నపూర్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా దీన దయాల్ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. అతిథి గురునాథం ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు తెలుగు పద్యమాధుర్యాన్ని, అవధాన కళ గురించి విద్యార్థులకు వివరించారు. మరో అతిథి ఆవల కొండ అన్నపూర్ణ ఎన్ని భాషలైనా నేర్చుకోగానీ తెలుగు భాషను మరిచిపోవద్దని సూచించారు. తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ పి కుమారి నీరజ తెలుగు భాషా దినోత్సవం జరుపుకోవడానికి కారణాన్ని, గిడుగు వారి జీవన ప్రస్థానాన్ని వివరించారు. అనంతరం తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా 23వ తేదీ నుంచి జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అతిథులను దుశ్శా లువతో సత్కరించారు. చిరంజీవి దివ్య శిల్ప వందన సమర్పణ అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నరసింహారావు, శ్రీరాములు, పద్మమాలిని పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాతృ భాషలోనే భావ వ్యక్తీకరణ సులభమని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేరంగుల శ్రీధర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలోని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేరంగుల శ్రీధర్ మాట్లాడుతూ మనసులోని భావాలను మనం సంపూ ర్ణంగా వ్యక్తం చేయాలంటే అది మాతృభాష వలనే సాధ్యమన్నారు. విద్యార్థులు మన మాతృభాష తెలుగును నేర్చుకుంటే ఇతర భాషలను సులభంగా నేర్చుకోగలుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక తెలుగు ఉపాధ్యాయులు పసల వీరాస్వామి తెలుగు భాష గొప్పతనం, ప్రాముఖ్యత, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు తెలుగు పద్యాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు దేరంగుల శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వివిఎస్ఆర్ స్కూల్ లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. 100కి మంది పైగా పిల్లలు రకరకాల కవుల వేషధారణలో వచ్చి అలరించారు. భాషా దినోత్సవం సందర్భంగా వివిధ తరగతుల పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించారు. చార్ట్ ప్రదర్శన, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నందిమండలం బాలకృష్ణం రాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపల్ శాంత కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-చంద్రగిరి: స్థానిక చంద్రగిరిలోని శ్రీచైతన్య పాఠశాల లో తెలుగు భాషా దినోత్సవ, క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జమీల్ భాషా ప్రసంగించారు. విద్యార్థులందరూ సంప్రదాయ అలంకరణలో పాఠశాలకు వచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జరిగిన నృత్యం, పిరమిడ్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దీన్ విజయ్ కుమార్, ప్రైమరీ ఇన్చార్జి యాస్మిన్,ప్రిప్రైమరి ఇన్చార్జి రత్న, ఎఓ కిషోర్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటుకు శ్రీకారం

విశాలాంధ్ర -వరదయ్య పాలెం: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తల వల్లం పంచాయతీ పరిధిలోని రాచ కండ్రిగ గ్రామ హరిజనవాడ కాలనీలో గత కొన్ని నెలలుగా తాగునీటి కోసం ప్రజ లు నానారకాలుగా ఇబ్బంది పడుతున్నారు తెలుసుకున్న వేనాటి అశోక్ ఈ విషయమై సర్పంచ్ లోకేశ్వరి బ్రదర్ (కండెల మణి) తో చేర్చించి వారి ద్వారా సహాయ సహకారం తో స్పందించి ఆ గ్రామ ప్రజలతో కలిసి వేనాటి అశోక్ భూమిపూజ చేపట్టారు. గ్రామ ప్రజలతో బోర్ వెల్ మిషన్ ద్వారా మంచినీటి బోర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యలపై తనదైన బాటలో ప్రత్యేక చొరవ చూపి, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన వేనాటి అశోక్, సర్పంచ్ కండెల మణికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ సిబ్బంది అశోక్, వెంకటేష్, ఎల్లయ్య, కిష్టయ్య, గ్రామస్తులు మునిశేఖర్, సురేష్, రమేష్, రామారావు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స: ఎంఇఓ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మన సంస్కృతి, సంప్రదాయాలతో అనుసంధానం కావడానికి మాతృ భాష చాలా శక్తి వంతమైన మాధ్యమం అని, వైభవోపేతమైన భాష తెలుగు అని అందుకే నేడు 29వ తేదీని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని మండల రెండవ విద్యాశాఖ అధికారి ముని సుబ్రమణ్యం అందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండవ విద్యాశాఖ అధికారి ఆవుల మునిసుబ్రహ్మణ్యం కల్లివెట్టు పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణదేవ రాయలు అన్నారని, 'చెయ్యెతి జై కొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి గలవోడా..' అనే వేములపల్లి గీతం ఆలపిస్తే తెలుగు వారి మనసు ఉప్పొంగుతుందన్నారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో ఒకటిగా వెలుగొందుతున్న భాష తెలుగు భాష అని, మూలం ద్రావిడ భాష అని, ఆంధ్రప్రదేశ్ అధికారిక భాష చట్టం ద్వారా 1966 లో తెలుగు ను రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండలంలోని బిఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కే రమణయ్య ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణతో కవుల వస్త్రధారణ తో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. నెలవాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి ఆకాష్ వంద తెలుగు పద్యాలను ముక్తకంఠంగా ఆలపించాడు. పల్లమాల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంలో తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ, మురళి, పేర్నేటి సుబ్బారావు, శ్రీనివాసులు, ఆనందయ్య, శిరోమణి, సరళ, షమ్మా, కె. పురుషోత్తం, మునేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా వేటూరి ప్రభాకర శాస్త్రి వర్ధంతి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: ప్రముఖ సాహితీవేత్త, రచయిత వేటూరి ప్రభాకర శాస్త్రి 73వ వర్ధంతి సందర్భంగా తిరుప తి శ్వేతా భవనం ఎదురుగా ఉన్న ఆయ న విగ్రహానికి రాయలసీమ రంగస్థల కళాకారులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి నాయకులు టీ.సుబ్రమణ్యం రెడ్డి, జయప్రకాష్, అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు.ఆ తర్వాత వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం స్నపన తిరుమంజనంను వేడుకగా నిర్వహించారు. ఇందులో స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.00 నుండి 6 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. చివరగా రాత్రి 7గంటల నుండి 8.30 గంటల వరకు యాగ శాలలో ఆలయ అర్చకులు నిర్వహించిన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి.

స్మార్ట్ సిటీ పనులు గడువులోపు పూర్తిచేయాలి

- అధికారుల సమీక్షలో స్మార్ట్ సిటీ ఎండీ హరిత

విశాలాంధ్ర- తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ అండ్ నగర పాలక సంస్థ కమిషనర్ దామల చెరువు హరిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ రూపకల్పనలో భాగంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజి నీరింగ్ అధికారులు, ఏఈ-కామ్, ప్రాజెక్టుల కాంట్రాక్టర్లతో స్మార్ట్ సిటీ ఎండీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపి ప్రాజెక్టుల పనులు ఈ మేరకు జరిగాయి? ఇంకా ఎంత బ్యాలన్స్ ఉన్నాయి? ఎందుకు ఆలస్యం అవుతున్నాయి?' అనే విషయాలను అధికారుల ద్వారా అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు, వినాయక సాగర్ పనులను త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయా లన్నారు. అన్ని ప్రాజెక్టుల పనులు ఇచ్చిన గడువు లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ.లు దేవిక, మోహన్, ఏఈ, ప్రతినిధి బాలాజీ, అఫ్కాన్ ప్రతినిధి రంగస్వామి, ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర - రామచంద్రాపురం: మండలం నెత్తకుప్పం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' ను నిర్వహిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి పంచాయతీ అధ్యక్షుడు సాయి శశికాంత్, ఆర్ చంద్రబాబు ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం లభించింది. డప్పులు కొట్టి.. టపాకాయలు పేల్చి.. పూల వర్షం కురిపిస్తూ.. జేజేలు పలుకుతూ యువత గ్రామ శివార్ల నుంచి ఘన స్వాగతం పలికారు. అనంతరం మూలస్థానఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి విజయం కలగాలని ప్రార్థించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆ తర్వాత గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం నాలుగు ఏళ్లుగా అందించిన సంక్షేమం పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ జాబితాను చేత పట్టుకుని ఇంటి ముందు నిలబడ్డ హర్షిత్ రెడ్డికి మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికి ఆత్మీయతను పంచుకున్నారు. కరోనా వంటి కష్టకాలంలో నేనున్నానని భరోసా కల్పించిన చెవిరెడ్డి కుటుంబం పట్ల అక్కడి గ్రామస్తులు సానుకూలత వ్యక్తం చేస్తూ వచ్చే ఎన్నికలలో మోహిత్ రెడ్డి విజయానికి కష్టపడి పనిచేస్తామని మాట ఇచ్చారు. గడప గడపకు వెళ్లి జనంతో మమేకమైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడి అధికారులతో కలిసి చర్చించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి ఏవి బ్రహ్మా నంద రెడ్డి, జడ్పీటిసి డిల్లీ రాణి, వైస్ ఎంపిపి ఆర్ లావణ్య చంద్రబాబు, మండల కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, మండల పరిశీలకులు వీరపల్లి గణపతి నాయుడు, ఎంపిటీసిలు కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, జి మునేంద్ర బాబు, ఎద్దుల రాజేష్, వైసీపీ నాయకులు నాదెండ్ల గోపీ చౌదరి, మోహన్ రావు, ప్రభాకరరెడ్డి, మధు, మాజీ సర్పంచ్ చంగల్ రాయలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్మారక నాణెం ఆవిష్కరణ తెలుగువారికి గొప్ప గౌరవం: టీడీపీ

విశాలాంధ్ర -తిరుపతి :ఎన్టీఆర్ శత జయం తిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారకనాణెం ఆవిష్కరించడం తెలు గు జాతికి దక్కిన గొప్ప గౌరవం అని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ అన్నారు. తిరుపతి టౌన్ క్లబ్ సర్కిల్‌లో ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం, పూలమాలతో నివాళులు అర్పించారు. కారణ జన్ముడు తెలుగు బిడ్డ నందమూరి తారక రామారావు 100 రూపాయల నాణెంను కేంద్ర ప్రభుత్వం ప్రచురించడం టీడీపీకి, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకి అందరికీ ఇదొక అద్భుతమైన రోజు అన్నారు. సినిమా రంగంలో ఒక అద్భుతమైన నటుడిగా, రాజకీయాల్లో ప్రవేశించి ప్రజలే దేవుళ్లు..సమాజమే దేవాలయం అనే నినాదంతో వెళ్లి గాంధీ ఆశయాల్ని ప్రజలకు చేరువ చేసిన ఏకైక నాయకుడు టీడీపీ సంస్థాగత అధ్యక్షుడు నందమూరి తారక రామారావు అన్నారు. ఆయనకి నేడు ఇలాంటి గౌరవం దక్కడ దేశానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, తిరుపతి కార్పొరే టర్, రాష్ట్ర, నగర కమిటీ,జిల్లా, మహిళా, యువత, విద్యార్థి, వార్డ్ ప్రసిడెంట్లు, సెక్రెటరీలు, అనుబంధ విభాగ ప్రసిడెంట్ సెక్రటరీలు, తిరుపతి టీడీపీ కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొని జయప్రదం చేశారు.

'టీడీపీతోనే పేదల అభివృద్ధి..'

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీడీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళ వారం శ్రీకాళహస్తి పురపాలకసంఘం పరిధిలోని 15వ వార్డులో టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు జి.విజయ కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతమ్మ, 15వ వార్డు ఇంచార్జీలు కరీం, జహీర్, సునీమా, షఫీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పిస్తా మన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. 18-59 మధ్య వయసు గల వారికి ప్రతి నెలా రూ.1500 సాయం చేస్తా మన్నారు. వ్యవసాయం కోసం రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికసాయం చేస్తామన్నారు. ఈ సంక్షేమ పథకాలు కావాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠారమేష్, రేణుకమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షు రాలు కృష్ణవేణి, మండల మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, మాజీ కౌన్సిలర్ అనిత, బషీర్, జిలానీ భాషా, శ్రీలక్ష్మి, సుజాత, షాకీరాలీ, గోపీనాథ్, అస్మత్, సుబ్బయ్య, కిట్టు, ప్రతా ప్, ప్రసాద్ రావు, మునిరాజా యాదవ్, సురేష్, అనిల్, మస్తాన్ , సురేష్ నాయుడు, అమరావతి , వసంతమ్మ, సరో జనమ్మ, యాదగిరి, శివారెడ్డి, చంద్రకళ, రత్నమ్మ పాల్గొన్నారు.

పలు సమస్యలపై నేదురుమల్లికి అర్జీలు సమర్పణ

విశాలాంధ్ర - తిరుపతి: ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరిలోని వారి నివాసానికి విచ్చేసిన నాయకులు ,కార్యకర్తలు రామ్ కుమార్ రెడ్డి కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 'మీ సమస్యలన్నిటిని పరిష్కరిస్తాను' అని వెంకటగిరి నియోజవర్గ ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనను కలవ వచ్చునని భరోసా ఇచ్చారు. అనంతరం నేదురుమల్లి నివాసంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాల గురించి కౌన్సిలర్లతో రామ్ కుమార్ రెడ్డి చర్చించారు.

ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - యర్రవారిపాళ్యం: మండలం లోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం వేటూరి ప్రభాకర శాస్త్రి వర్ధంతి , గిడుగు రామమూర్తి జయంతి (తెలుగు భాషా దినోత్సవం) సందర్భంగా ప్రిన్సిపాల్ బి.టి.శ్రీదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వ హించారు. వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి సంస్థలో రీడరుగా పనిచేసే రోజుల్లో అన్నమయ్య సంకీర్తనలు వెలుగు చూశా యని, శాసన శోధకుడిగా, గ్రంథ పరిష్కర్తగా వారి సేవలు మరచి పోలేనివి అని శ్రీదేవి అన్నారు. గిడుగు భాషకు చేసిన కృషి వల్లే నేడు వ్యావహారిక భాష అందరికీ అందిందని మన మాతృభాష మాధు ర్యం అర్థమైందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశా ల కమిటీ చైర్మన్ , సభ్యులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేడుకగా బాలగంగమ్మ జాతర

- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సారె సమర్పణ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం మంగళం - 2 పరిధిలో కొలువు దీరిన బాలగంగమ్మ జాతర సంద ర్భంగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సారె సమర్పించారు. మంగళవారం అమ్మ వారి జాతర వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సారెతో విచ్చేసిన మోహిత్ రెడ్డికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపుగా మోహిత్ రెడ్డి ఆలయం వద్దకు చేరుకున్నారు. ముందు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకులకు సారెను అందించారు. సారెను అర్చకులు అమ్మవారికి ధరింపజేశారు. ప్రత్యేక పూజలు అనంతరం అర్చ కులు మోహిత్ రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మంగళం ప్రజలను వెన్నంటే ఉంటూ చల్లగా చూడాలని బాల గంగమ్మ ను మోహిత్ రెడ్డి ప్రార్థించారు. మోహిత్ రెడ్డి వెంట నాయకులు పార్టీ డివిజన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మీ రాంబాబు, పంచాయతీ అధ్యక్షులు హరికృష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మీ గణేష్ ఉన్నారు.

టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారికి మంగళవారం హీరో మోటోకార్ప్ సంస్థ గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించింది. ఈ వాహనం ధర రూ.97,000 అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ప్రతినిధివిజయ్ కన్నన్ వాహనం తాళాలను తిరుమల డిఐ జానకీరామ్ రెడ్డికి అందజేశారు.

ఓటరు జాబితాపై కలెక్టర్ ఆకస్మిక పరిశీలన

విశాలాంధ్ర - గూడూరు : కలెక్టర్ వెంకటరమణారెడ్డి మంగళవారం ఆస్మికంగా గూడూరు, చిల్లకూరు మండలాలలో ఓటరు జాబితాలను పరిశీలించారు. గూడూరు డివిజన్ లో నెల రోజులుగా ఆర్డీఓ కిరణ్ కుమార్ ఆదేశాలతో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి తప్పులు, మార్పులు, చేర్పులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓల పనితీరును పరిశీలించేందుకు ఆయన మంగళవారం గూడూరు మండలం తిప్పవరప్పాడు, గూడూరు రెండవ పట్టణంలోని మాళవ్యా నగర్, ఒకటవ పట్టణంలోని ఇండియన్ సివిల్ సర్వీస్ రోడ్డు, చిల్లకూరు మండల కేంద్రంలో ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్‌ఓల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడూరు డివిజన్ లో బీఎల్‌ఓలు బూత్ లెవల్ ఓటరు జాబితా పరిశీలన ఎలా చేస్తున్నారనే విషయమై ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ఆర్డీఓ సూచనల మేరకు చక్కగా విధులు నిర్వహిస్తున్నారని కితాబిచ్చారు. 18ఏళ్లు నిండిన వారందరూ లింగభేదం లేకుండా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ ఎం. కిరణ్ కుమార్, గూడూరు, చిల్లకూరు తహశీల్దార్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

వీరభద్రుని ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో కొలువై ఉన్న శ్రీకళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళ వారం స్వామి వారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు.

ఫారమ్ నెం.URC - 2

చట్టంలోని పార్ట్ - 1 ఆఫ్ ఛాప్టర్ XXI క్రింద రిజిస్ట్రేషన్ గురించి నోటీసుకై ఇస్తున్న ప్రకటన (కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీల నిబంధనలు,2014 - రూలు 4(1) క్రింద) నమోదు చేయడానికి అధికారం)

1) కంపెనీల చట్టం, 2013 సెక్షన్ 366లోని సబ్‌సెక్షన్ (2) ప్రకారం, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్‌లోని రిజిస్ట్రారుకు మెస్సర్స్ సెకండ్ యూనివర్స్.కామ్ వారు ఒక దరఖాస్తు చేయబడ్డాయని ఇందుమూలముగా నోటీసు ఇవ్వబడింది. సెకండ్ యూనివర్స్.కామ్ వారు కంపెనీల చట్టం 2013 21 అధ్యాయం యొక్క పార్ట్1 క్రింద భాగస్వామ్య సంస్థ, షేర్ల ద్వారా పరిమితం చేయబడిన కంపెనీగా నమోదు చేయబడవచ్చు.

2) కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యం దిగువ విధంగా వుంది: మెస్సర్స్ సెకండ్ యూనివర్స్ (భాగస్వామ్య సంస్థ) సహోద్యోగ స్థలాలు మరియు దాని అనుబంధ సేవలను అందించే వ్యాపారానికి సంబంధించినవి, ఇందులో షేర్డ్ ఆఫీస్ స్పేస్‌లు, వర్క్ స్టేషన్లు, మీటింగ్ రూమ్‌లు మరియు వ్యాపార సహాయక సేవలను అందించడంతో పాటు, వ్యక్తులు, వ్యవస్థాపకులు, స్టార్టప్‌ల మధ్య నెట్‌వర్కింగ్ మరియు సహకారాన్ని సులభతరం చేయడంతో సహా పరిమితం కాకుండా, కమ్యూనిటీ ఆధారిత సహోద్యోగ వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ఫ్రీలాన్సర్లు మరియు వ్యాపారాలు నడుపుతున్న వ్యాపారాన్ని స్వాధీనం చేసుకోవడానికి,

3. ప్రతిపాదిత సంస్థ యొక్క అసోసియేషన్ యొక్క ముసాయిదా మెమొరాండం మరియు అసోసియేషన్ కథనాల కాపీని కేరాఫ్ తులసీరామన్.కె., 2వ అంతస్తు, డి.నెం.7-6-264/సి, వెంకటాద్రి ప్లాజా,మంగళం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్- 517507, ఇండియా వారి వద్ద తనిఖీ చేసుకోవచ్చు.

4) ఈ దరఖాస్తుపై అభ్యంతరం వ్యక్తంచేసేవారు ఎవరైనా తమ అభ్యంతరాన్ని సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్(సిఆర్‌సి), ఐఐసిఏ, ప్లాటు నెం.6,7 & 8, సెక్టార్ 5, ఐ.ఎం.టి, మనేసర్,జిల్లా గుర్గావ్ (హర్యానా), పిన్‌కోడ్- 122052 లోని రిజిస్ట్రార్ వారికి ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి ఇరవై ఒక్క రోజులలోపు లిఖిత పూర్వకంగా దాని నమోదిత కార్యాలయంలో కంపెనీకి కాపీతో తిరుపతిలో తెలియజేయవచ్చునని నోటీసు ఇవ్వబడింది.

తిరుపతి, తేది: 29.08.2023

సం॥ నరేంద్రకుమార్ కావేటి, భాగస్వామి సం॥ రామిరెడ్డి పూతి, భాగస్వామి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

విశాలాంధ్ర - బుచ్చినాయుడుకండ్రిగ : సొసైటీ వారి సహకారంతో సహకార ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం మంగళవారం మండల కేంద్రంలో సొసైటీ సింగిల్ విండో చైర్మన్ హరినాథ్ రెడ్డి ఆదేశాల మేరకు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కళాజాత బృందం ఆర్థిక వ్యవస్థపై అవగాహన లేకపోతే జరిగే నష్టం పై పాటల రూపంలో రైతులకు వివరించారు, ఈ సమయం ముందు సీఈవో మహేష్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరం అని, బ్యాంకింగ్ రంగ సేవల్లో ఇటీవల కాలంలో పెను మార్పులు చోటు చేసు కుంటున్నాయి. ఎక్కడ చూసినా ఏటీఎంలు, ప్రజల చేతుల్లో క్రెడిట్, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ప్రైవేట్ ఫైనాన్స్, చీటీలు,మైక్రో ఫైనాన్స్, వివిధ రూపంలో రైతులు ఆర్థిక మోసగాళ్ల చేత మోసపోతున్నారని తెలిపారు. రైతులు ఇతర బ్యాంకుల వద్దు సొసైటీ బ్యాంకు ముద్దు, బ్యాంకు ద్వారా వాహన మిత్ర, గృహ నిర్మాణాలు, రైతులకు సబ్సిడీ రుణాలు , ఆదర్శవంతమైన ఆర్థిక రుణాలను రైతుల కోసం మంజూరు చేస్తున్నారని తెలిపారు. మండలంలో రైతుల కోసం సహకార బ్యాంకు అందిస్తున్నామన్నారు. ఆర్థిక అక్షరాస్యత వ్యక్తులను ఆర్థిక మోసంలోని రక్షిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సాయి రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

పుత్తూరు మండల ఏఐఎస్ఎఫ్ కమిటీ ఏకగ్రీవం

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: పుత్తూరు మండల ఏఐఎస్ఎఫ్ కమిటీని పుత్తూరు పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అనేక విద్యారంగ సమస్యలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి రాక ముందు ఒక మాట, వచ్చిన తర్వాత ఒకలా వ్యవహరిస్తుందని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్ విద్యార్థులకి అనేక వాగ్దానాలు చేశాడని ముఖ్యంగా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తానని చెప్పి ఇంత వరకు సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేదని, రాష్ట్రంలో ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అనంతరం పుత్తూరు నూతన కమిటీ బండి చలపతి ఏకగ్రీవంగా ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్ పుత్తూరు మండల అధ్యక్షులుగా రవితేజ ఉపాధ్యక్షులుగా బావి, రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్ సహాయ కార్యదర్శిగా దిలీప్, నాగరాజ్, అరవింద్, శ్రీకాంత్, కోశాధికారిగా దినేష్‌లను ఏకగ్రీవంగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ పుత్తూరు లోని విద్యరంగా సమస్యల పరిష్కారం కోసం పోరాటలు చేస్తామని, సెప్టెంబర్ 3న తిరుపతి లో జరిగే జిల్లా మహాసభ కు నగర నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులని సమీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ , నాయకులు వర్మ, సాయి, హాబి, సాయికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - గూడూరు : ప్రతిపక్ష పార్టీ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం సనత్ నగర్ లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ కేవలం పాలక పార్టీపై దుమ్మెత్తి పోసే పనులు చేస్తోందన్నారు. కనీసం గత మున్సిపల్ కమిషనర్ అవినీతిపై గళం విప్పింది కూడా పాలకపక్ష పార్టీయేనని గుర్తు చేశారు. ఆరోగ్యకర వాతావరణంలో పాలకుల పొరపాట్లను, ఏదైనా కమ్యూనికేషన్ గ్యాప్ వంటివి ఉంటే ప్రజలకు, పాలకులను ప్రశ్నించవచ్చున్నారు. అలా కాకుండా ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపే ప్రయత్నం మానుకోవాలన్నారు. అబద్దాలను గూడూరు పట్టణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గూడూరులో గెలస్తా మని భ్రమ పడుతున్నారని, ప్జలు వంద శాతం వైసీపీతోనే ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. మరోసారి పార్టీపై అబద్ధపు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.